సమాచారం

వేలకు వేలు బిల్లులు కట్టలేం

మేడ్చల్: వేలకు వేలు వస్తున్న నల్లా బిల్లులను తాము కట్టలేమని గుండ్లపోచంపల్లి వాసులు సిబ్బందికి తేల్చి చెప్పారు. గుండ్లపోచంపల్లి ఎస్సీ వాడలో మున్సిపల్ సిబ్బంది గురువారం నల్లా బిల్లుల వసూలుకు వెళ్లారు. వేల రూపాయలు బకాయిలు ఉండటంతో బిల్లులు వెంటనే చెల్లించాలని లేని పక్షంలో నల్లా కనెక్షన్లు కట్ చేస్తామని హెచ్చరించడంతో కాలనీ వాసులు తిరగబడ్డారు. వాయిదాల పద్ధతిలో బకాయిలను చెల్లించాలని సిబ్బంది కోరారు.

భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి


పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ అన్నారు. ఉపసర్పంచ్ పెంటమ్మతో కలిసి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. దాతల సహకారంతో గ్రామంలో మోడల్ అంగన్‌వాడీ భవనం నిర్మిస్తున్నామని అంగన్‌వాడీ కేంద్రంలో అన్ని వసతులు కల్పిస్తున్నామని అన్నారు.

ధోబీఘాట్ నిర్మాణంపై సమాలోచనలు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్‌లో ధోబీఘాట్ నిర్మించేందుకు రజక సంఘం నాయకులతో చైర్మన్ కొండల్‌రెడ్డి సమాలోచనలు జరిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 3వ వార్డులోని సర్వే నంబర్ 128–132లో ఉన్న 1200 చదరపు గజాల భూమిలో ధోబీఘాట్ నిర్మించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చైర్మన్ ఈ సందర్భంగా చెప్పారు. కమిషనర్ సురేష్, కౌన్సిలర్ చింతల రాజశేఖర్, ఏఈ నరేష్, రజక సంఘ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో వెలసిన పలు అక్రమ నిర్మాణాలను గురువారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు చేపడుతామన్నారు. ఆక్రమదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

మృతుల కుటుంబీకులకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, ఉప సర్పంచ్ రాజు

ఘట్‌కేసర్: కొర్రెముల్ గ్రామంలో ఇటీవల మరణించిన మృతుల కుటుంబీకులకు మల్లారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయం అందజేశారు. గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ఎల్లమ్మ, నర్సమ్మ, అశోక్‌కు ఒక్కొక్కరికి రూ. 5 వేల చొప్పున రూ. 15 వేలు సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్ ఉప సర్పంచ్ రాజుముదిరాజ్ అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు ఆంజనేయులు, మాజీ ఉప సర్పంచ్ నాగార్జున, సత్యనారాయణ ముదిరాజ్, ట్రస్ట్ సభ్యుడు వేణు, బాధితులు పాల్గొన్నారు.

భూకబ్జాదారులకు రెడ్ కార్పెట్

- డబుల్ ఇళ్ల హామీ మరిచిన రాష్ట్ర ప్రభుత్వం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాలమల్లేష్

అల్వాల్: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం భూకబ్జాదారులకు రెడ్ కార్పెట్ పరుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్. బాలమల్లేష్ అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గురువారం నేరేడ్‌మెట్‌లోని మల్కాజిగిరి మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించాయని విమర్శించారు. మోదీ అధికారంలోకి వచ్చినప్పుడు సిలిండర్ ధర రూ.410 ఉంటే 2023లో దాదాపు రూ.1200కు పెంచి సామాన్యులపై భారం మోపిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, దళితులకు 3 ఎకరాల భూమి చొప్పున పంపిణీ చేస్తామని, ఇంటి స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షల ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని విమర్శించారు. మరోపక్క భూకబ్జాదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, ఐటీ కంపెనీలకు, రెడ్ కార్పెట్ పరిచి అప్పనంగా అమ్మేస్తోందని విమర్శించారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతి పత్రం అందజేశారు. సీపీఐ నాయకులు ఉన్నారు.

కబ్జా.. సాగదిక

- కబ్జాదారులపై అధికారుల సీరియస్
- రెవెన్యూ, పోలీసు అధికారుల వద్ద భూకబ్జాదారుల వివరాలు
- ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిన రెవెన్యూ యంత్రాంగం


అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

జవహర్‌నగర్: భూకబ్జాదారులపై రెవెన్యూ, పోలీస్‌శాఖ నిఘా వేసిందా..?ఆక్రమణ దారులకు సంకెళ్లు తప్పవా..? రెవెన్యూశాఖ కూపీలాగుతున్న తీరు చూస్తే అలాగే అనిపిస్తోంది. ల్యాండ్ మాఫియాపై ఉక్కుపాదం మోపేందుకు మేడ్చల్ రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ , ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు స్పష్టమవుతోంది.

- జవహర్‌నగర్‌లోని ల్యాండ్ మాఫియా పీచమణచడానికి రెవెన్యూ అధికారులు పావులు కదుపుతున్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ నకిలీ నోటరీల ద్వారా కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను గుంజుకుంటున్న వారిపై చర్యలకు రంగం సిద్ధమైంది. నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల భూముల ధరలు ఆకాశాన్నంటిన తరుణంలో జంటనగరాల్లో ల్యాండ్‌మాఫియా విపరీతంగా పెరిగింది.

రెవెన్యూ గుప్పిట్లో కబ్జాదారుల చిట్టా...

భూకబ్జాలకు పాల్పడేవారి ప్రొఫైల్‌ను తయారు చేసే పనిలో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం వారి చిట్టా రెవెన్యూశాఖతో పాటు పోలీస్ డైరీలో ఉంది. పూర్తి స్థాయిలో వివరాలు సేకరించిన తర్వాత ఎటువంటి చర్యలు తీసుకునే విషయమై దృష్టి సారించే అవకాశం ఉంది. కబ్జాలకు పాల్పడే వారితో పాటు వారికి సహరించే వారిపై కూడా నిఘా పెట్టారు. కబ్జాలకు పాల్పడే వారు ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదంటున్న రెవెన్యూ అధికారులు ఆ దిశగా చర్యలకు శ్రీకారం చుట్టే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

నకిలీ డాక్యుమెంట్లతో...

నగరం చుట్టు పక్కల భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. గతంలో భూమి అమ్మిన యజమానులతో కుమ్మక్కవుతున్న ల్యాండ్ మాఫియా తమకు అమ్మినట్లు వారితో పాత తేదీలతో కాగితాలు రాయించి భూమి కొనుగోలు చేసిన వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జవహర్‌నగర్‌లో మరికొంత మంది కబ్జాదారులు మాజీ సైనికుల దగ్గర భూమిని కొనుగోలు చేసినట్లు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను స్వాహా చేస్తున్న వారి వివరాలను ఆరాతీస్తున్నారు.

ప్రభుత్వ సూచిక బోర్డులు మాయం ...

రెవెన్యూ అధికారులు ఇప్పటి వరకు జవహర్‌నగర్‌లోని చాలా భూములలో ప్రభుత్వ బోర్డులు ఏర్పాటు చేసి వాటికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసినా ఫలితంలేకుండా పోయింది. రాత్రికిరాత్రే ఆ బోర్డులను తొలగించి ఆక్రమిస్తున్నారు.


ప్రభుత్వ స్థలంలో బోర్డులు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్

కలెక్టర్ సీరియస్

నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ అమోయ్ కుమార్ , మల్కాజిగిరి డీసీపీ జానకీ జవహర్‌నగర్ భూముల కబ్జాలపై సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ భూముల్లో బోర్డులను ఏవిధంగా తొలగించి నిర్మాణాలు కొనసాగిస్తున్నారనే విషయాలపై సమగ్ర సమాచారం కావాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాలు ఆక్రమణలకు గురవడంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రభుత్వ ప్రజావసరాలకు కేటాయించిన స్థలాలను మున్సిపాలిటీ అధికారులు కాపాడుకోకుంటే తిరిగి స్వాధీనపరచుకుంటామని కీసర ఆర్డీవో రవి హెచ్చరికలు జారీ చేశారు.

నకిలీ పత్రాలపై నిఘా



ఇక్కడ చాలా మంది కబ్జాదారులు నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూములను కబ్జాచేస్తున్నారు. వాటిపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నాం. ఇప్పటికే ఆరుగురికి పైగా కబ్జాదారులను గుర్తించి కేసులు నమోదుచేశాం. మరి కొంత మందిని గుర్తించాల్సి ఉంది. డబుల్ నోటరీలు సృష్టిస్తున్న వారి చిట్టాను పరిశీలిస్తున్నాం. ఈ విషయంలో ఎటువంటి వారు ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తేలేదు.
– జవహర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతారాం

ఆపదలో ఉన్న వారిని ఆదుకునే సీఎంఆర్‌ఎఫ్


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్‌ఫండ్ ఉపయోగపడుతుందని మంత్రిచామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం గోధుమకుంట గ్రామానికి చెందిన శ్రీలేఖకు రూ.60 వేలు, కొడే కృష్ణకు రూ.40 వేలకు సంబంధించి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్‌చెక్కులను మంత్రి మల్లారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. సర్పంచ్ ఆకిటిమహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే కీసర గ్రామపంచాయతీపరిధిలోని వన్నిగూడ గ్రామానికి చెందిన శివరాంకు రూ 9 వేలు, సరితకు రూ 20 వేలకు సంబంధించి మంజూరైన చెక్కులను గురువారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాయకపు వెంకటేష్ పంపిణీ చేసారు.

కంటివెలుగు వైద్యశిబిరం ప్రారంభం

కీసర: కంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటివెలుగు వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో స్థానిక కౌన్సిలర్ కౌకుట్ల మమతా కృష్ణారెడ్డితో కలిసి కంటివెలుగు వైద్యశిబిరాన్ని ప్రారంభించారు.


కంటివెలుగు వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి

ఆర్థిక సాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న వెంకటేష్

కీసర: ఇటీవల అనారోగ్యం కారణంగా మృతిచెందిన కీసర గ్రామానికి చెందిన గోరంటి లక్ష్మమ్మ కుటుంబసభ్యులను గురువారం బీఆర్ఎస్ నేత నాయకపు వెంకటేష్ పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కోఆప్షన్‌సభ్యుడు చిత్తార్ల రమేష్‌గౌడ్, గోరంటిప్రవీణ్ పాల్గొన్నారు.

18 నుంచి పూడూర్‌లో మల్లన్న జాతర


మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సర్పంచ్

మేడ్చల్ రూరల్: మండలంలోని పూడూర్ గ్రామంలోని కేతమ్మ మల్లికార్జున స్వామి ఆలయ జాతర, కల్యాణ మహోత్సవాలు ఈ నెల 18 నుండి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ బాబు యాదవ్, యాదవ సంఘం సభ్యులు తెలిపారు.18న ప్రత్యేక పూజలతో ఉత్సవాలు ప్రారంభమై సాయంత్రం గంగపూజ, రాత్రి ఒగ్గు కథలు,భజనలు, 20న కేతమ్మ సమేత మల్లికార్జున స్వామివారి కళ్యాణం, అనంతరం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం అగ్ని గుండాలు, బండ్లు బోనాలు, 20న కొండపోచమ్మ, ఉప్పలమ్మలకు బోనాలు, రాత్రి ఒగ్గు కథలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

మంత్రికి ఆహ్వానం..

జాతర మహోత్సవంలో పాల్గొనాలని గురువారం మంత్రి మల్లారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డిలకు గ్రామ సర్పంచ్ బాబు యాదవ్ పాల్గొన్నారు.

సీఎంఆర్ కళాశాలలో ఇండక్షన్ పబ్లిసిటీ ఎగ్జిబిషన్


ఎయిర్ ఫోర్స్ వాహనం వద్ద విద్యార్థులు

మేడ్చల్: కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఇండక్షన్ పబ్లిసిటీ ఎగ్జిబిషన్ వెహికిల్ ఈవెంట్ నిర్వహించారు. ఎయిర్ ఫోర్స్ వాహనాన్ని విద్యార్థుల ఎదుట ఉంచి అందులో నుండి అందిస్తున్న సేవలను వివరాలను వివరించారు. వింగ్ కమాండర్ విక్రమ్‌కుమార్,ఫ్లైట్ లెఫ్టినెంట్ ధృవకుమార్ యాదవ్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



ఘట్‌కేసర్: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో గురువారం లభ్యమైంది. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన మేరకు.. పోచారం మున్సిపాలిటీ యంనంపేట్ నవదుర్గ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తి (50) మృతదేహం పడిఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ఫైర్ విన్యాసంలో విద్యార్థికి తీవ్ర గాయాలు




గాయపడిన విద్యార్థి హనివర్ధన్ రెడ్డి

కీసర: పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన ఫైర్ విన్యాసంలో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యాదాద్రి జిల్లా బీబీనగర్ మండల కేంద్రానికి చెందిన హనివర్ధన్‌రెడ్డి చీర్యాల గ్రామపరిధిలోని శ్రీ స్వామినారాయణ గురుకుల పాఠశాల్లో 6వ తరగతి చదువుతున్నాడు. ఫిబ్రవరి 11న పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా పాఠశాల్లో విద్యార్థులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ఫైర్(అగ్ని)కు సంబంధించిన విన్యాసాలు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో ప్రమాదవశాత్తు హనివర్ధన్‌రెడ్డి తలకు, కాలికి తీవ్రంగా గాయలయ్యాయి. దీంతో విద్యార్థి తండ్రి కుమారుడిని నగరంలోని డీఆర్‌డీఏ అపోలో ఆసుపత్రికి తరలించాడు. ఈ విషయంపై డీఈఓ విజయకుమారి మాట్లాడుతూ.. పాఠశాల యాజమాన్యానికి రెండు నోటీసులు ఇచ్చామని, సంజాయిషీ పరిశీలించిన తరువాత నిర్లక్ష్య ధోరణి ఉందని తేలితే పాఠశాల గుర్తింపు రద్దు చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు.

క్రమబద్ధీకరణ ఫీజు తగ్గించాలి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని 13వ డివిజన్‌కు చెందిన కాలనీవాసులు గురువారం మేడిపల్లి తహసీల్దార్‌ను కలిశారు. జీవో నంబర్–59 ప్రకారం క్రమబద్ధీకరణ కోసం తమ ప్లాట్స్‌కు సంబంధించి అధికంగా పన్నులు విధించారని, చెల్లించలేని స్థితిలో ఉన్నామని విన్నవించుకున్నారు. కూలీ, నాలీ చేసుకుని జీవనం సాగిసున్నామని చెప్పారు. ప్రభుత్వం టాక్స్‌లను తగ్గించాలని కోరారు. సీనియర్ నాయకులు దానగల్ల యాదగిరి, డివిజన్ అధ్యక్షుడు గోపు రాము, యువజన నాయకులు జెన్న రాజు, కొండ శ్రీనివాస్, పండ్ల మల్లయ్య, విజయలక్ష్మి తదితరులున్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ మహేష్‌నగర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీరెడ్డి అన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు గురువారం సంబంధిత అధికారులతో కలిసి ఆమె కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలించారు. సమస్యను పరిష్కరించే విధంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



న్యాయం చేయాలంటూ విద్యార్థుల నిరసన


కాలేజీ ఎదుట నిరసన తెలుపుతున్న బాధిత విద్యార్థులు

కుషాయిగూడ: హాజరు శాతాన్ని తక్కువగా చూపుతూ విద్యా సంవత్సరాన్ని వృథా చేస్తున్న దేవ్స్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ యజమాన్యంపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని నర్సింగ్ విద్యార్థులు కోరుతున్నారు. హాజరు శాతాన్ని తక్కువగా చూపి హాల్ టికెట్లు రాకుండా చేసిందని దేవ్స్ నర్సింగ్ కాలేజీలో ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఆరోపిస్తున్నారు. యజమాన్యం తప్పుడు సమాచారం పంపడంతో 50 మంది విద్యార్థులకు హాల్‌టికెట్లు అందక పరీక్షకు దూరం కావాల్సిన పరిస్థితులు దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. జరిమానాతో ఈ నెల 18 వరకు ఫీజు కట్టుకునే అవకాశం ఉందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి యజమాన్యం తీరుపై విచారణ జరిపి హాల్‌టికెట్లు అందేలా చూడాలని వేడుకుంటున్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి


ఏఈ సతీశ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బాల్‌రెడ్డి, రమేశ్‌కుమార్, ఆంజనేయులు

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ అన్నోజీగూడ రాజీవ్‌గృహకల్పలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కారించాలని పోచారం మాజీ ఉప సర్పంచ్ ఆకిటీ బాల్‌రెడ్డి ఘట్‌కేసర్ విద్యుత్ ఏఈ సతీశ్ కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశాడు. 2007లో ఏర్పాటు చేసిన అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ నాణ్యత కోల్పోయి సమస్యలు ఎదురువుతున్నాయని ఏఈకి ఇచ్చిన లేఖలో పేర్కొన్నారు. ఏఈ సానుకులంగా స్పందించి త్వరలో కొత్త కేబుల్ వేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజీవ్ గృహకల్ప మాజీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, సారగండ్ల రమేశ్‌కుమార్ ముదిరాజ పాల్గొన్నారు.

‘ఆయుష్మాన్ భారత్’తో ఉచిత వైద్య సేవలు

మల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకంలో దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చని ఎస్వీ చంద్రయ్య ఫౌండేషన్ చైర్మన్ ఎస్వీ కిట్టు అన్నారు. మల్లాపూర్‌లో ఆయుష్మాన్ భారత్ ఉచిత నమోదు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఎస్వీ కిట్టు మాట్లాడుతూ.. ఈ పథకంలో రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. అధికారులు మంజుల, భవానీ, ఫీరోజ్‌ఖాన్, రమేష్ నాయక్, కిరణ్, తదితరులు ఉన్నారు.

వైకుంఠధామం నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం

బోడుప్పల్: చెంగిచర్లలోని వైకుంఠధామం పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించడంతో పచ్చదనం లేకుండా పోయిందని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. చెంగిచర్లలోని వైకుంఠధామాన్ని గురువారం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఇష్టారాజ్యంగా పనిచేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను పట్టించుకోకపోవడంతో ప్రజాక్షేత్రంలో విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. చెంగిచర్లలోని కాకతీయకాలనీ, క్రాంతికాలనీ, ప్రివిలేజ్ కాలనీల్లోని ప్రకృతి వనాలను పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బింగి జంగయ్య యాదవ్, కొత్త చందర్‌గౌడ్, సీనియర్ నాయకులు కొత్త రవిగౌడ్, డీఈఈ శ్రీలత, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, హరితహారం సూపర్‌వైజర్ సాకేత్ తదితరులున్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

మౌలాలి: కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అభివృద్ధి, సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు అవకాశం ఉందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. జోడో యాత్రలో భాగంగా గురువారం మౌలాలి డివిజన్ ఆర్టీసీ కాలనీ, కృష్ణానగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయన్నారు. శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, జీవన్‌రెడ్డి, రాములు, శ్రీనివాస్‌గౌడ్, ఉమేష్‌సింగ్, సంతోష్ ముదిరాజ్, మహేందర్‌గౌడ్, శ్రీను, రాజేష్‌గౌడ్, విట్టల్ , నర్సింహగౌడ్ పాల్గొన్నారు.



వైద్య రంగంలో తెలంగాణ ఆదర్శం


మాట్లాడుతున్న వైద్యాధికారులు


అధికారులతో జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్, ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, సిబ్బంది

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ ప్రాథమిక వైద్య కేంద్రాన్ని గురువారం నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ అధికారులు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు ఎంతో భరోసా కలిగిందన్నారు. రాష్ట్రంలోని ప్రజలకు నాణ్యమైన వైద్యంతో పాటు ఉచితంగా పరీక్షలు చేస్తూ మందులు అందచేస్తున్నామన్నారు. వైద్య రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే మోడల్‌గా నిలుస్తుందన్నారు. జవహర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇప్పటికే రెండుసార్లు పరిశుభ్రతలో ప్రథమస్థానం నిలిచిందని, మరోసారి ముందు వరుసలో నిలుస్తుందన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పద్మావతి, సిబ్బందిని అభినందించారు. కేంద్ర అసెస్‌మెంట్ సభ్యులు డాక్టర్ హర్షల సుధాకర్, అనుజ్‌శర్మ, జవహర్‌నగర్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పద్మావతి, సురేష్, బచ్చు, షౌకత్, సిబ్బంది, విష్ణు, నర్సింహ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.